క్లుప్తంగా

పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోండి

ముదిగొండ: మండలంలోని సన్న, చిన్న కారు రైతులు తమ పొలాలకు పత్యామ్నాయ పంటల కోసం వివిధ పండ్ల తోటల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈజీఎస్ ఏపీఓ రంగనాయ కమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు జామ, మామిడి, నిమ్మ, కొబ్బరి, మునగ మొక్కలు అందుబాటు లో ఉన్నాయని, జాబ్ కార్డు లేని వారు దర ఖాస్తు చేసి, పండ్ల తోటల కోసం గుంతలు తవ్వడం, మొక్కలు నాటడంతో పాటు మూడు సంవత్సరాలు పెంచి సంరక్షిస్తే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారని తెలిపారు. ఆర్ఐ నుంచి సర్టిఫికెట్, జాబ్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో జత చేసి దరఖాస్తు చేసుకున్న రైతులకు మంజూరు చేయనున్నట్లు ఏపీఓ తెలిపారు.

నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు..

కొణిజర్ల: రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని ఎంఈఓ బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ.. ఏదో ఒక కంపెనీ పేరుతో నకిలీ విత్తనాలు అంటగట్టడానికి ప్రయత్నిస్తారని, వారి వలలో పడొద్దన్నారు. వారు గ్రామాల్లో ఓ ఏజెంట్‌ను పెట్టుకుని కమిషన్ ఇచ్చి రైతులను మభ్యపెడతారని, అలాంటి వారు ఎవరైనా వస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కొణిజర్ల: వైరా మున్సిపాలిటీ 17వ వార్డు మండల పరిధిలోని దిద్దుపూడిలో మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి శనివారం వార్డులో భూమిపూజ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు తాతా సుధాకర్, వైరా మండల అధ్యక్షుడు చెరుకూరి చలపతిరావు, 17, 18 వార్డుల మాజీ కౌన్సిలర్లు తడికమళ్ల నాగేశ్వరరావు, ధనేకుల వేణు భూమిపూజ నిర్వహించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ప్రాంతంలోని బుగ్గపాడు, నాగుపల్లి ప్రాంతాల్లోని భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎస్‌కె ఉమర్ కోరారు. సత్తుపల్లిలో శనివారం ప్రదర్శన నిర్వహించి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. సీతారామ ప్రాజెక్టు నీళ్ల ఏజెన్సీ మండలాలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మధు, నాగేశ్వరరావు, జె.సీతారామయ్య, సత్యనారాయణ, రాఘవులు, లక్ష్మయ్య, రామలక్ష్మి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ - గిర్దావర్ నడుమ వాగ్వాదం

బోనకల్ : మండల కేంద్రంలోని తహసీల్‌లో చొప్పకట్లపాలెం మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు, ఆర్ఐ నవీన్‌కుకుమార్ నడుమ శనివారం వాగ్వాదం చోటుచేసుకుంది. చొప్పకట్లకు చెందిన నలుగురు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం కోసం 40రోజుల క్రితం దరఖాస్తు చేశారు. దరఖాస్తుదారులతో కలిసి మాజీ సర్పంచ్ కార్యాలయానికి రాగా, ఆర్ఐ నవీన్‌కుమార్ దరఖాస్తులు ఎక్కడ ఉన్నాయో తెలియదని సమాధానం చెప్పాడు. దీంతో జవాబుదారీతనం లేకుండా ఎందుకు పని చేస్తున్నారంటూ సుబ్బారావు వాగ్వాదానికి దిగగా గంట పాటు గందరగోళం నెలకొంది. ఈ విషయమై ఆర్‌డీఓ నర్సింహారావుకు మాజీ సర్పంచ్ ఫిర్యాదు చేశాడు.

రైతు సదస్సును జయప్రదం చేయాలి

ఎర్రుపాలెం: మండల కేంద్రంలో ఈ నెల 19న నిర్వహించనున్న రైతు సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య కోరారు. శనివారం మండలంలోని వెంకటాపురంలో నిర్వహించిన గ్రామ స్థాయి రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధినేని రమేష్, కార్యదర్శి బోంతు రాంబాబు హాజరై రైతులనుద్దేశించి మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ప్రభాకర్, నాయకులు జోగయ్య, వెంకట్రామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలి

సత్తుపల్లిరూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సిద్ధారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసినా.. ఇళ్లు అనర్హులకే కేటాయించారని. గ్రామసభలు జరిగి నెలలు గడుస్తున్నా ఏ ఒక్కరికి రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, సర్వేశ్వరరావు, జ్యోతి, కుమారస్వామి, సనందరావు, కృష్ణ, రాములు పాల్గొన్నారు.

ఈత కొట్టేందుకు సిద్ధమైన చిన్నారులు



స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారులు



సరదాగా ఈత కొడదాం..

- ఎండల్లో హాయ్.. హాయ్
- ఈతపై పెరుగుతున్న ఆసక్తి
- పిల్లలతో సందడిగా స్విమ్మింగ్ పూల్

సండే స్పెషల్

సత్తుపల్లిటౌన్: భానుడి భగభగ నుంచి స్విమ్మింగ్ పూల్ సాంత్వన చేకూరుస్తోంది. పిల్లలకు నీళ్లంటే ఎంత ఇష్టమో తెలియంది కాదు.. ఈత రాకపోతే అదే ఎంత ప్రమాదకరమో కూడా తెలిసిందే. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈత నేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వేసవి నేపథ్యంలో పెద్దవారు నుంచి పిల్లల వరకు స్విమ్మింగ్ పూల్‌కి వస్తుండలంతో ఉదయం, సాయంత్రం సందడిగా ఉంటోంది. శారీరక ధారుఢ్యం కోసం వ్యాయామాలు చేసేవారు కూడా నిత్యం ఈతకు సై అంటున్నారు.

పిల్లలకు ప్రత్యేకంగా..

సిమ్మింగ్‌పూల్‌లో లోతు తక్కువగా ఉన్న దాంట్లో పిల్లల కోసం ప్రత్యేకంగా ఉండగా.. ఏడు ఏళ్లలోపు వరకు, పెద్దలకు మరో స్విమ్మింగ్‌పూల్ ఉంది. కుటుంబ సభ్యులు, శిక్షకుల పర్యవేక్షణలో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు నీటిలో కేరింతలు కొడుతున్నారు. వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనాన్ని, ఉల్లాసాన్ని పొందుతున్నారు. సత్తుపల్లి స్విమ్మింగ్‌పూల్‌లో కొన్నేళ్లుగా సాధన చేసి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులు ఉన్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ఈత నేర్చుకునేటప్పుడు సేఫ్టీ పరికరాలు వినియోగించాలి.
- స్విమ్మింగ్‌పూల్‌లోకి దిగేముందు, బయటకు రాగానే స్నానం చేస్తే చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉండదు.
- తలకు టోపీ, కళ్లకు అద్దాలు ధరించటం మంచిది.
- చర్మవ్యాధులు, జలుబు ఉన్నవారు స్విమ్మింగ్‌పూల్‌లోకి వెళ్లకూడదు.
- చెరువులు, కుంటలు, కాలువల్లో లోతైన ప్రదేశాలకు వెళ్లటం ప్రమాదకరం.

భయం పోయింది..



వేసవి సెలవుల్లో ఈత నేర్చుకొని సద్వినియోగం చేసుకున్నా. నీళ్ల భయం పోయింది. ఈత పోటీల్లో బహుమతులు సాధించా. నాన్నతో కలిసి ఈత నేర్చుకున్నా. ఏడు అడుగుల లోతు వరకు వెళ్తున్నా.

– ఎస్.లూకస్ ప్రెషస్లే, సత్తుపల్లి

ప్రత్యేక శిక్షణ..



వేసవి సెలవులు కావటంతో పిల్లలు ఈత నేర్చుకునేందుకు ఎక్కువగా వస్తున్నారు. ప్రత్యేకంగా నలుగురు శిక్షకుల పర్యవేక్షణలో చిన్నారులకు ఈత నేర్పిస్తున్నాం. ఈత పోటీల్లో కూడా విజయం సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

– పి.అవినాష్, కోచ్, సత్తుపల్లి

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

వైరా: వైరాలో ఈనెల 24న నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. జాబ్‌మేళా పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. యువతకు ఉద్యోగ కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, నాయకులు నూతి సత్యనారాయణ, మహ్మద్ జావేద్, నర్సిరెడ్డి, నారాయణరావు, సౌజన్య, అశోక్, నరేష్, శ్రీను, వీరభద్రం, శేఖర్‌గౌడ్, అంజని, దుర్గాప్రసాద్, రవి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, ఎమ్మెల్యే తదితరులు

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా హనుమంతరావు

మధిర: మధిర టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా మల్లాది హనుమంతరావు ఎంపిక య్యారు. శనివారం ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు పాల్గొని.. అధ్యక్షుడితో పాటు.. ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు గుత్తా సీతయ్య, చేకూరి శేఖర్‌బాబు, వేమురి సునీల్‌కుమార్, పుల్లారావు, రామకోటి, రాణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



మల్లాది హనుమంతరావు

- తల్లాడ: మండలంలోని నాలుగు గ్రామాల్లో టీడీపీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి వెంకటేశ్వర్లు ఈ వివరాలను ప్రకటించారు. కొత్త వెంకటగిరి అధ్యక్ష, కార్యదర్శులుగా సాయిన్ని నాగేశ్వరరావు, కంచెపోగు ఏలి, కలకొడిమ అధ్యక్ష, కార్యదర్శులుగా సూర్యదేవర రాజేష్, షేక్ సైదులు, లక్ష్మీపురంలో.. శీలం రామకోటారెడ్డి, గుర్రాల లక్ష్మారెడ్డి, కుర్నవల్లిలో.. శీలం సత్యనారాయణరెడ్డి, చల్లా శ్రీను ఎన్నికయ్యారని తెలిపారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి

కారేపల్లి: మతతత్వ విధానాలను దేశ ప్రజలు ప్రతిఘటించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతురావు అన్నారు. శనివారం కారేపల్లి క్రాస్‌రోడ్డులో పార్టీ సీనియర్ నాయకుడు పాపినేని సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కారేపల్లి మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టడానికే 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేనిఎడల ప్రజల్లో వ్యతిరేకత మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, వైరా నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఎర్ర బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శివరామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు సుధాకర్, భూషయ్య, శ్రీను, అనంతరామయ్య, వీరునాయక్, వెంకటయ్య, సంగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హేమంతరావు

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న తహసీల్దార్ చందర్

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన బొబ్బిళ్ల చుక్కమ్మకి కల్యాణలక్ష్మి చెక్కును తహసీల్దార్ పున్నం చందర్ శనివారం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భద్రునాయక్, భాగం నాగేశ్వరరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి లయన్స్‌క్లబ్ చేయూత

వైరా: కలకత్తా ఎస్ఐటీలో బీటెక్ చదువుతున్న వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని చెరుకూరి నివేదితకు వైరా లయన్స్‌క్లబ్, డాక్టర్ అసోసియేషన్ వైరా వారు రూ.35 వేలు ఆర్థిక సాయం అందించారు. బీటెక్ నాల్గో సంవత్సరం ఫీజు చెల్లించే స్తోమత లేకపోవడంతో ఆమె చదువులకు అయ్యే ఖర్చును డాక్టర్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ కోటయ్య, డాక్టర్ కాపా మురళీ కృష్ణలు నివేదిత తండ్రికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఉంద్రుశ్యాంబాబు, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై గణపయ్య..!

ముదిగొండ: ముదిగొండలోని వృద్ధగిరి కొండపై స్వయంభుగా వెలసి వేంచేసిన యున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రతి శనివారం పూజలు నిర్వహిస్తుంటారు. ముదిగొండ సమీపంలోని ఖమ్మం–కోదాడ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ వృద్ధగిరి గట్టుపై ఓ రాతి కొండకు రావిచెట్టు వేర్లకు గణపతి ఆకారంలో కనిపిస్తుండడంతో.. భక్తులు కుంకుమ అద్ది పూజలు చేశారు. లక్ష్మీనరసింహుని సన్నిధిలో గణపయ్య తోడుగా ఉన్నాడని భక్తులు చెబుతున్నారు.

లక్ష్మీనరసింహస్వామి గుట్టపై రావి చెట్టు వేర్లతో ఏర్పడిన గణపయ్య ఆకారం



సొసైటీ చైర్మన్ కృష్ణయ్య మృతి

సత్తుపల్లి: మండలం కిష్టారం సొసైటీ చర్మన్, మాజీ సర్పంచ్ మామిళ్లపల్లి కృష్ణయ్య(80) శనివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు అనుచరుడిగా కృష్ణయ్యకు పేరుంది. ఆయన మృతిపట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఉడతనేని అప్పారావు తదితరులు సంతాపం తెలిపారు.



మామిళ్లపల్లి కృష్ణయ్య(ఫైల్)

గుండెపోటుతో సీపీఎం కార్యకర్త..

కొణిజర్ల: మండలంలోని పెద్ద రాంపురం గ్రామానికి చెందిన సీపీఎం కార్యకర్త పుణ్యపు ఉపేందర్(23) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఈమేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే, ఉపేందర్ తండ్రి, సీనియర్ నాయకుడు వీరభద్రం, కుటుంబీకులను పరామర్శించారు. నాయకులు భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ, తుడుం ప్రవీణ్, పలిమెల నాగయ్య, జంగిలి లక్ష్మయ్య, వడ్లమూడి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ తహసీల్దార్‌గా రమాదేవి

బోనకల్: బోనకల్ తహసీల్దార్‌గా కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఏడాగా విధులు నిర్వహించిన ఎం.రమాదేవి బదిలీపై వచ్చారు. బోనకల్ తహసీల్దార్‌గా పనిచేసిన పున్నం చందర్ మహబూబాద్‌కు బదిలీపై వెళ్లారు.

రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

చింతకాని: రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సాయం పొందడానికి గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని మధిర ఏడీఏ విజయ్ చంద్ర పేర్కొన్నారు. శనివారం మండలంలోని వందనం, నేరేడ గ్రామాల్లో నిర్వహిస్తున్న రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు వ్యవసాయ విస్తరణాధికారుల వద్దకు వెళ్లి గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయడంతో పాటు రసీదులు భద్రపరచుకోవాలన్నారు. ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసుకోవాలని సూచించారు. అలాగే ఆయిల్ పాం సాగుతో మంచి లాభాలను సాధించవచ్చని.. దానిపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మానస, వ్యవసాయ విస్తరణాధికారులు రాము, ఆయేషా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



ఫార్మర్ ఐడీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న మధిర ఏడీఏ విజయ్‌చంద్ర

సత్ప్రవర్తన అలవర్చుకోండి



మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకునేందుకు ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌లో జరిగిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాన్నారు. అనంతరం సబ్‌జైల్ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ మీరాఖాసీం సాహెబ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎస్ సుమబాల, జైల్ సూపరింటెండెంట్ కుటుంబ రాజు, న్యాయవాదులు విజయ్ కుమార్, వెంకట్రావ్, కోర్టు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 లక్షల పరిహారం చెక్కు అందజేత

తల్లాడ: విద్యుత్ షాక్‌తో మృతిచెందిన మాజీ ఎంపీపీ కాంపల్లి రాము కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును శనివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి అందజేశారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన రాము కరెంట్ షాక్‌తో మరణించగా.. విద్యుత్‌శాఖ నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే, విద్యుత్ అధికారులు మృతుడి ఇంటి వద్దకి వెళ్లి కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. రాము చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కరెంట్ తీగలు వేలాడుతున్నాయని ఎమ్మెల్యేకు తెలుపగా.. ఆమె విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మిట్టపల్లి గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో సత్తుపల్లి డీఈ ఎల్.రాములు నాయక్, ఏడీఈ సతీష్, ఏఈ రాయల ప్రసాద్, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు రఘుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, జనార్దన్ రెడ్డి, వీరారెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, విద్యుత్ శాఖాధికారులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోనకల్: మండలంలోని మోటమర్రి సబ్‌స్టేషన్ నందు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ నెల 18, 19, 20 తేదీల్లో సబ్‌స్టేషన్‌లో ఆటో మిషన్, మెయింటనెన్స్ మరమ్మతుల కారణంగా.. ఆళ్లపాడు, గోవిందాపురం(ఏ), రాయన్నపేట, మోటమర్రి గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వైరా ఏడీఈ కిరణ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మొక్కలు ఎండుతున్నాయ్..

మండలంలో మొక్కల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. తల్లాడ రింగ్ సెంటర్ నుంచి కల్లూరు రోడ్డులో ఉన్న డివైడర్‌పై వివిధ రకాల పూల మొక్కలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కుండీల్లో ఏర్పాటు చేశారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి కారణంగా వాటికి సిబ్బంది వారం రోజులుగా నీరు పోయకపోవడంతో మొక్కలు ఎండిపోయి చనిపోతున్నాయి. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన మొక్కలు ఎండిపోతున్నా.. సంబంధిత సిబ్బందికి మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా అధికారులు జోక్యం చేసుకొని మొక్కలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– తల్లాడ



ప్రశ్నించాల్సిన అధికారి : కృష్ణారావు, తల్లాడ మేజర్ పంచాయతీ ఈఓ
సెల్ నంబర్ : 9032404279

వర్మీ కంపోస్ట్ అన్నదాతకు వరం

- పంటలకు ఉపయోగాలు
- భూమికి బలం

వైరా: పంటలకు రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడుతుండటంతో సాగు భూములు నిర్జీవంగా తయారవుతున్నాయి. రసాయన ఎరువులు వాడిన పంటకు చీడపీడలను తట్టుకునే శక్తి తగ్గడంతో దిగుబడి తగ్గుతోంది. ఈ నేపథ్యంలో సేంద్రియ ఎరువులు వినియోగం పెంచాల్సిన అవసరం ఉంది. వర్మీ కంపోస్ట్ తయారీ వాటి వినియోగంతో కలిగే ప్రయోజనాల గురించి వ్యవసాయ శాఖ ఏఓ వివరించారు.

వర్మీ కంపోస్ట్‌తో ఉపయోగాలు..

వర్మీ కంపోస్టు అంటే వానపాముల పెంపకంతో పనికిరాని వ్యర్థాలను సారవంతమైన ఎరువుగా మార్చే విధానం. ఈ ఎరువుతో అనేక లాభాలు ఉన్నాయి. నేలను సారవంతం చేసే సూక్ష్మజీవులు పెరుగుదలకు తోడ్పడి భూమిలో నీరు ఇంకే శక్తిని వర్మీ కంపోస్ట్ పెంచుతుంది. వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుంది. గాలిలోని నత్రజనిని మొక్కలకు అందించడమే కాకుండా భూమిలోని ఖనిజ లవణాలను కరిగించి మొక్కకు అందజేస్తుంది. భూసారం పెరుగుతుంది. చీడపీడల ఉధృతిని తగ్గిస్తుంది. ఒక టన్ను వర్మీకంపోస్టు వేస్తే బంక శాతం తగ్గి భూమి నల్లబడుతుంది. వర్మీకంపోస్టులో 3శాతం నత్రజని, 2.5 శాతం నుంచి 3శాతం భాస్వరం, 1.5 శాతం కాల్షియం, 2 శాతం మెగ్నీషియం, 0.7 శాతం సల్ఫర్, 0.5 శాతం ఐరన్, 0.6 శాతం జింక్ ఉంటాయి. చౌడు భూముల్లో ఈ ఎరువు వాడి చౌడును నిరోధించవచ్చు.

కావాల్సిన పదార్థాలు..

10 చదరపు మీటర్ల బెడ్ కోసం ఎండిన సేంద్రియ వ్యర్థాలు 200–300 కిలోలు, కుళ్లిన పెంట ఎరువు 500 కిలోలు, సేంద్రియ వ్యర్థాలు 800 కిలోలు (గాజు, ఇనుము, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలు కాకుండా ఆకులు, చెత్త, చెదారం, పనికి రాని కూరగాయలు).

తయారీ ఇలా..

4 అడుగుల వెడల్పు, 2 అడుగుల లోతు, 40 అడుగుల పొడవుతో గుంత తయారు చేసుకోవాలి. దానిపై గుంతలో 5 సెంటీమీటర్లు మందంతో ఇటుక ముక్కలు, ఇసుక కలిపి బాగా దట్టించాలి. దీనిపై పేడ నీళ్లు చల్లాలి. తర్వాత ఎండిన ఆకులు, వ్యర్థ పదార్థాలు 15 సెంటీ మీటర్లు పేర్చాలి. తర్వాత కుళ్లిన పశువుల పెంట 15 సెంటీ మీటర్లు మందం వేయాలి. దానిపై పశువుల మూత్రం, కావాల్సిన నీటిని చల్లాలి. తరువాత ఒక చదరపు మీటరకు 1,000 వానపాపముల చొప్పున వదలాలి. తర్వాత వానపాములపై 20 సెంటీ మీటర్లు వరకు కుళ్లిన చెత్త వేయాలి. దానిపై పలుచటి గోనె సంచులు కప్పాలి. ప్రతీ రోజు నీళ్లు చల్లాలి. ఎప్పుడే తేమ ఉండేటట్లు చూసుకోవాలి. నీరు నిల్వ ఉండరాదు. చీమలు, చెద పట్టకుండా చూసుకోవాలి. వర్మీబెడ్ డోడలు సిమెంట్ ప్లాస్టరింగ్ చేయాలి. 30 రోజుల తర్వాత ఒకసారి కలియబెట్టాలి. ఈ విధంగా చేసిన 70 రోజులకు మంచి ఎరువు తయారువుతుంది. వానపాములు రెట్టింపు అయి గోనెసంచికి అంటుకుంటాయి. ఇలా తయారైన ఎరువులో చెడు వాసన ఉండదు. ప్రతీరైతు తన ఇంట్లో వర్మీ కంపోస్టను తయారు చేసుకోవచ్చు. దీనికి ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుంది.



వాన పాములతో తయారు చేసిన కంపోస్ట్